


రాత్రి ఏడు గంటలైంది. సుశీల పిల్లలిద్దరికీ అన్నాలు పెట్టి వాళ్లను పడుకోమని చెప్పి తను నాలుగు జాకెట్లు తీసుకుని చేతిపని చేస్తూ కూర్చుంది.

మనసంతా అదోలా వుంది. ఆఫీసు పనిమీద వూరు వెళ్లిన భర్త శంకరం మూడు రోజులైనా తిరిగి రాలేదు అసలు క్యాంపుకే వెళ్లారో? లేక మరెక్కడికైనా వెళ్లారో? మొట్టమొదటిసారిగా భర్తమీద అనుమానం, కోపం, చిరాకు, అసహ్యం కలిగాయి

దానికి కారణం లేకపోలేదు. నాలుగు రోజులు క్రితం సాయంత్రం ఆఫీసునుండి ఇంటికి రావలసిన శంకరం తెల్లవార్లూ రాకుండా ఉదయం ఎనిమిదింటికి దిగాడు. "ఏమండీ రాత్రి రాలేదేమిటి?" అని అడిగితే "ఎన్నాళ్ళనుండో పెండింగ్‌లో వున్న వర్కంతా కంప్లీట్ చెయ్యమని మా ఆఫీసరు చెప్పాడు. నా స్నేహితుడు మురళి, నేను కూర్చుని తెల్లవార్లూ పని చేశాము. అతనితో కలిసి హోటల్‌కెళ్ళి భోజనం చేశాను పని పూర్తయ్యేసరికి రాత్రి మూడయింది. అంత రాత్రప్పుడు ఇంటికి రావటం బద్ధకం వేసి ఇద్దరం అలాగే బెంచీలమీద పడుకున్నాము అబ్బ నడుం పట్టేసిందనుకో" అన్నాడు.

కాని ఆ మురళి భార్య సుశీలను పరిచయం చేసుకునేందుకు వీళ్ళింటికి వచ్చింది. మాటల సందర్భంలో "అన్నయ్యగారు మొన్న మా ఇంట్లోనే పడుకున్నారు. మా పక్క రూమ్‌లో ఓ టైపిస్టు వుంటున్నాడు అతనికి పెళ్లి కాలేదు. అతని రూమ్‌లో వీళ్ళందరూ సీసాలు తెచ్చుకుని పార్టీ చేసుకున్నారని" చెప్పింది

ఇంకా తన భర్త తాగుడు, పేకాటలాంటి వ్యసనాలకు బానిస అని, అదేమంటే తనను చావబాదుతాడని తమ పుట్టింటివాళ్ళు చాలా పేదవాళ్ళని, పెళ్ళికి ముందే మురళికి చదువు చెప్పించి పెళ్లి చేశారని, కట్నం రూపేణా ఏమీ ఇవ్వలేదని, ఎప్పుడూ పోట్లాడుతాడని, ఏదైనా అంటే మావాళ్ళు పెట్టలేనివాళ్ళని చీటికీ, మాటికీ పుట్టింటికి పొమ్మని అంటాడని, మరో దారనేది లేక పిల్లల కోసం జీవచ్ఛవంలా బ్రతుకుతున్నానని పాపం ఆవిడ మనసులోని వ్యధంతా సుశీల దగ్గర వెళ్ళబోసుకుంది

తొలి పరిచయంలోనే మనసులోని వ్యధనంతా చెప్పుకుంటున్న ఆవిడ అమాయకత్వానికి సుశీలకు చాలా జాలనిపించింది ఆవిడ వెళ్లిన దగ్గరనుండి సుశీలకు మనసు మనసులో లేదు భర్తమీద విపరీతంగా కోపం వచ్చింది. వాళ్ళింట్లో తాగి తందనాలాడివచ్చి ఆఫీసులో వర్క్ చేశానని ఎంత బాగా అబద్ధమాడారు? పదేళ్ళ వైవాహిక జీవితంలో ఏనాడన్నా ఇలా అబద్ధాలాడికాని, చెడు పనులు చేసికాని ఎరగరు.

బదిలీ అయ్యి ఈ వూరొచ్చి మూడ్నెల్లయింది. అప్పటినుండి ఆయనలో ఏదో మార్పు వస్తోంది టైమ్‌కు ఇంటికి రావటం కాని జీతం సరిగా ఇవ్వటంకాని జరగడంలేదు. అదేమని అడిగితే ఏదోవకటి కుంటిసాకులు చెపూ్త తప్పించుకుంటున్నారు ఇదంతా చెడు సావాసదోషమే.

వ్యసనం అనేది లేకుండానే వుండాలికాని ఏ కొంచెంవున్నా వేరుపురుగులా కాపురాల్ని నిలువునా కూల్చెయ్యగలదు. ఏమంటూ ఈ బదిలీ వచ్చిందో కాని అప్పటినుండి తనకు ఎడతెరిపి లేకుండా కుడికన్ను అదురుతోంది ఇన్నాళ్ళు వాతంవల్లనేమో అనుకుంది కాదు, కాదు. తనకేదో తీవ్రమైన ముప్పే వాటిల్లనున్నది తను ముందుగానే మేల్కొని ఆయన్ని వ్యసనాలజోలికి పోకుండా సాధ్యమైనంతవరకు కట్టుదిట్టం చెయ్యాలనుకుంది.

* * *

సుశీల కలవారింట్లో పుట్టి ఎంతో అపురూపంగా పెరిగింది ముగ్గురాడపిల్లల్లో రెండవది సుశీల సుశీలకు హైస్కూల్ చదువే సరిగా ఒంటపట్టలేదు. కట్నం పెద్దమొత్తం ఇచ్చి ఇంజనీర్‌కిచ్చి పెళ్లి చెయ్యాలనుకున్నారు తల్లితండ్రులు కాని వూళ్ళోనే వున్న వేలువిడిచిన మేనత్త కొడుకు శంకరంను ప్రేమించింది సుశీల.

శంకరం స్కూల్ ఫైనల్ పాసై ఓ గవర్నమెంటు ఆఫీసులో ఎల్ డి. సి. గా ఉద్యోగం చేస్తున్నాడు. ఉద్యోగం తప్పించి మరే ఇతర ఆస్తిపాస్తులు లేవు. కుంటా, శెంటూ ఆస్తి లేని శంకరాన్ని అల్లుడిగా చేసుకోవటం సుశీల తల్లి తండ్రులకు సుతరామూ ఇష్టంలేదు "శంకరాన్ని తప్పించి మరెవర్నీ పెళ్లి చేసుకోను. అలా జరిగిననాడు తను జీవించనని గట్టిగా చెప్పింది" సుశీల. చేసేది లేక ఇష్టంలేకున్నా సుశీలను శంకరానికిచ్చి పెళ్లి చేసి బాధ్యత తీరిందనుకున్నారు తల్లితండ్రులు

కాపురాని కొచ్చిన ఆరు నెలలకే భర్త జీతంతో ఇల్లు గడవదని తెలుసుకుంది సుశీల. మిషన్ కుట్టటం కొద్దిగా వొచ్చుకనుక ఓ సాయిబు దగ్గర నెలకు ముప్పై రూపాయలు ఇచ్చి రెండు నెలల్లో ఆడవాళ్ళవి, మొగవాళ్ళవి

అన్నిరకాల కత్తిరింపులూ, కుట్టటం నేర్చుకుంది.

వాయిదాల ప్రకారం డబ్బు కట్టేట్టు మిషన్ కొనుక్కుని బట్టలు కుడుతూ మిషన్ బాకీ తీర్చేసి ఇంట్లోకి కావలసిన సామానంతా ఏర్పర్చుకుంది. ఇద్దరబ్బాయిల తరువాత ఆపరేషన్ చేయించుకుంది. ఆధునిక గృహిణికి కావలసిన పరికరాలన్నీ రేడియో, ఫాన్, గాద్రేజ్ బీరువా, కుక్కర్, గ్యాస్ పొయ్యి, అలారం టైమ్‌పీస్ లాంటివన్నీ ఏర్పర్చుకుంది. చేతులకు గాజులు, మెడలోకి గొలుసు చేయించుకుంది.

భర్తకు వచ్చే జీతం నాలుగొందల్లో నెలకు వంద రూపాయలు బ్యాంకులో వేస్తూ సంసారం ఎంతో పొదుపుగ చేసుకొస్తోంది. శంకరం కూడ చేతి ఖర్చుకి ఓ పాతిక వుంచుకుని మిగిలిన డబ్బంతా సుశీల చేతికిచ్చేవాడు. అలా నెల నెలా బ్యాంకులో వేసిన డబ్బు అయిదు వేలు కాగా వడ్డీ వస్తుందని ఫిక్సడ్‌లో వేశారు ఆ డబ్బుతో గుడివాడలో స్థలం కొనుక్కోవాలని కూడ అనుకున్నారు.

బంధువులెవరూ రాకపోకలు లేకపోయినా సుశీల బాబాయి కొడుకు రామారావు మాత్రం అప్పుడప్పుడొచ్చిపోతుంటాడు. అతనికి సుశీలంటే ప్రాణం. రామారావుకు చెప్పారు. గుడివాడలో ఏదైనా స్థలం అమ్మకానికొస్తే కొనిపెట్టమని.

జాకెట్లన్నిటికీ చేతిపని చేసి గుండీలు కుట్టింది. ఇంతలో క్యాంపునుండి శంకరం తిరిగొచ్చాడు. భర్తను చూస్తూనే సుశీలకు పట్టరాని కోపం వచ్చింది. కాని వెంటనే తమాయించుకుంది. భోజనం చేసి పడుకున్నాక మెల్లగా అడిగింది. "స్నేహితుడు మురళి ఇంట్లో పార్టీకెళ్ళి ఆఫీసులో పనిచేసి బెంచీమీద పడుకున్నానని చెప్పారే ?" అని.

అది విన్న శంకరం ముందు కంగారుపడ్డాడు. ఆ తరువాత "నీకెలా తెల్సు ?" అన్నాడు కోపంగా. "ఎలా తెలిస్తే మీకెందుకు ? జరిగింది నిజమా, కాదా ?" గద్దించింది సుశీల పట్టుబడిన దొంగలా "ఏదో వెళ్ళానంటూ" నీళ్ళు నమిలాడు శంకరం.

"చూడండి ఈ వ్యసనాలనేవి జారుడుమెట్లు లాంటివి. తెలిసో తెలియకో వక్క మెట్టు జారితే మిగిలినవి వాటంతటవే జారిపడేలా చేస్తాయి."

"కాని ఈ చెడు వ్యసనాల జారుడుమెట్లు మీదనుండి జారిపడిన మనిషి పాతాళంలాంటి అగాధంలోకి పోతాడు. కనుక ఇంకెప్పుడూ అలాంటి వ్యసనాల జోలికి పోకండి' అంది

"ఏదో సరదాగా స్నేహితులతో కలిసి వక్కసారి పార్టీకెళ్ళినందుకు ఏమిటి నీ గొడవ ?" చిరాగ్గా అన్నాడు శంకరం

"వక్కసారి సరదాగా వెళ్ళారా ? అసలు వకటి అనేది లేనిదే రెండవది ఎలా వస్తుంది ? మీలో బలహీనత వుండబట్టే ఆ వక్కసారికూడ వెళ్ళగలిగారు. నేను రాను అంటే కాళ్ళూ, చేతులూ పట్టి లాక్కెళ్ళేవారా ? లేక బలవంతంగా నోరు తెరిచి గొంతులో పోసేవారా ?" రెట్టించింది సుశీల

ఆమెతో వాదించటం యిష్టంలేని శంకరం "నీతో వాగే ఓపిక నాకు లేదు. నిద్రొస్తోంది" అంటూ అటు తిరిగి పడుకున్నాడు. తెగేదాకా లాగటం మంచిదికాదులే అని సుశీల కూడ వూరుకుంది.

* * *

రోజులు గడుస్తున్నాయి కాని శంకరంలో మాత్రం మార్పు రాలేదు. స్నేహితులతో కలిసి తాగటం, పేకాడ్డం ఏ అర్ధరాత్రికో యింటికి రావటం, జీతం పూర్తిగా తన విలాసాలకే వాడుకోవటం మొదలుపెట్టాడు

సుశీల ఎంతో ఓర్పు, సహనంతో సాధ్యమైనంతవరకు అనునయంగా చెప్పిచూసింది. కాని ఫలితం లేకపోయింది ఓర్పు నశించిన సుశీల ఏదో వకటి అనటం యిద్దరిమధ్యన పెద్ద రాద్ధాంతం జరిగి నాలుగేసిరోజులు మాటలు లేకపోవటం జరుగుతోంది. వీళ్ళిద్దరి తగాదాల మధ్యన అమాయకులైన పిల్లలు మనసులు నలిగిపోతున్నాయి. వాళ్ళకు తండ్రి అంటే ఒకవిధమైన అసహ్యం కలిగి శంకరం నీడను చూడగానే పులిని చూసినట్లుగా భయపడి పోతున్నారు.

సుశీలకు మనసు మనసులోలేదు. కడుపునిండా భోజనం చెయ్యలేకపోతోంది. కంటినిండా నిద్రపోలేకపోతోంది. ఎక్కడ కూర్చున్నా ఏ పని చేస్తున్నా మనసుకు ఏదో ఆరాటంగా వుంది. ప్రశాంతత అనేది కరువైంది. ఏదో చెయ్యాలన్న ఆవేశం, ఏమీ చెయ్యలేని అసహాయత. కంటికీ, మంటికీ ఏకధారగా ఏడుస్తూ బాధపడుతోంది.

ఓ రోజు ఆఫీసు ప్యూన్ యింటికి వస్తే అడిగింది, "వీళ్ళు ఎక్కడ కూర్చుంటారని ?"

ఆఫీసరుగారు వెళ్ళిన తరువాత ఆఫీసులోనే కూర్చుంటారని, సీసాలతోపాటు కావలసిన సరంజామా అంతా తనతోనే తెప్పించుకుంటారని, అసలీ మురళిబాబుగారి మూలానే చాలామంది చెడిపోతున్నారని, ఏదైనా అంటే ప్యూన్ ముండావాడ్ని మూడు నిమిషాల్లో ఆఫీసరుగార్కి రిపోర్టిచ్చి బదిలీ చేయించగలరని, అందుకే తనేమీ అనకుండా వాళ్ళు చెప్పిందల్లా తెచ్చిస్తుంటానని" ఎంతో బాధపడిపోతూ చెప్పాడు

ఆర్రాత్రి పదిగంటలైనా శంకరం యింటికి రాలేదు. పిల్లలిద్దరూ నిద్రపోతుంటే బయటి తలుపుకు తాళంవేసి ఆఫీసుకు వెళ్ళింది సుశీల. వాచ్‌మెన్ వరండాలోనే కూర్చున్నాడు. "అయ్యగారున్నారా ?" అని అడిగింది. వాడు లోపలికెళ్ళి చూడకుండానే "ఉన్నారండి" అన్నాడు "అమ్మగారొచ్చింది. మిమ్మల్ని రమ్మంటున్నారని చెప్పిరా" అంది. వాడు లోపలి కెళ్ళొచ్చి "వస్తా పదమన్నారండి" అన్నాడు.

అది విన్న సుశీలకు చిర్రెత్తుకొచ్చింది. గబగబ లోపలికెళ్లి "లేచొస్తారా" అంది కటువుగా. శంకరం మాట్లాడలేదు. పక్కనున్న వాళ్లంతా సుశీలను అదోలా చూస్తున్నారు. ఓ నిముషమాగి "లేచొస్తారారండి. లేకపోతే నేను కూడ కూర్చుని ఆడతాను" అంది కోపంగా.

అది విన్న మురళి "ఏం గురూ వ్యవహారం ఇంతదాకా రానిచ్చావ్ ? ఫస్టులోనే యివ్వాల్సింది వార్నింగ్. మావాళ్ళకూడ మొదట్లో యిలాగే గొడవచేశారు. వక్కసారి డోసిచ్చాను. బస్ మళ్లీ నోరెత్తదనుకో" అన్నాడు వెకిలిగా.

సుశీలకు అరికాలిమంట నెత్తికెక్కింది. "దుర్మార్గుడా నా వచ్చనికాపురంలో నిప్పులు పోసినందుకు నా వుసురు, నా బిడ్డల వుసురు ఏదోనాటికి తప్పకుండా తగులుతుంది" అంటూ మురళిని తిట్టటం మొదలుపెట్టింది.

శంకరం ఏమనుకున్నాడోఏమో ? చేతిలోవున్న పేకముక్కలను విసురుగా బల్లకేసికొట్టి చరచరా బయటకు నడిచాడు దారిలో ఎవరూ మాట్లాడుకోలేదు. ఇంటికి రాగానే "ఆఫీసుకు వచ్చి నా పరువుతీస్తావా ?" విసురుగా సుశీలను కొట్టటానికి మీదికి వెళ్లాడు.

"ఆగు వక్కడుగు ముందుకు వేశావో నీ మర్యాద దక్కదు." దెబ్బతిన్న ఆడబెబ్బులిలా అరిచింది సుశీల.

"ఏం చేస్తావ్ ? ఎదురుతిరిగి కొడతావా?" కోపంగా అడిగాడు శంకరం.

"తప్పకుండాను." సూటిగా సమాధాన మిచ్చింది సుశీల.

క్రోధంతో సుశీల వంక కాసేపు చూసి "ఛీ! ఛీ! యిది ఇల్లుకాదు నరకం" అంటూ బయటకు వెళ్లిపోయాడు.

వాయిదాల ప్రకారం ఇంట్లో ఫర్నిచరంతా కొని అప్పులన్నీ తీరిపోయిననాడు సంతోషంగా తన భుజాలమీద చేతులువేసి వడిపిస్తూ "స్వర్గమిదే ఇలలో" అంటూ ఈలపాట పాడిన శంకరమేనా ఈయన అనుకుంది సుశీల

ఆ పోవటం, పోవటం రెండురోజుల వరకూ ఇంటికి రాలేదు శంకరం.

మూడవరోజు అర్ధరాత్రి వచ్చాడు. ఆ తెల్లారి వెళ్తూ సుశీల చూడకుండా అలారం టైమ్‌పీస్ పట్టుకుపోయాడు. రోజూ యిలాగే వచ్చి ఏదో వక వస్తువు పట్టుకుపోతాడని ఆ రాత్రి శంకరం ఎంతగా తలుపుకొట్టి పిలిచినా పలక్కుండా తలుపు తియ్యలేదు సుశీల

మర్నాడు ఉదయం తొమ్మిదిగంటల ప్రాంతంలో ఇంటికొచ్చాడు శంకరం. "నన్ను క్షమించు సుశీలా ! ఆ మురళిగాడి మాటలు విని వ్యసనాలకు బానిసనై నిన్ననవసరంగా కష్టపెట్టాను. ఈరోజు నుండి వాటన్నిటికీ స్వస్తి చెప్పేశాను." తనలోని నమ్మకాన్నంతా మాటల్లో పొందుపరుస్తూ అన్నాడు.

భర్తలో కలిగిన ఈ మార్పుకు సుశీలకు చాలా సంతోషం కలిగింది. ఆమె మనసిప్పుడు తేలిగ్గా దూదిపింజలా ప్రశాంతంగా వుంది పనులన్నీ చురుగ్గా చేసేస్తోంది. స్నానానికి వేణ్ణీళ్ళుపెట్టి చకచక వంట చేసేసింది. ఇద్దరూ కలిసి భోజనం చేశారు.

సుశీల నడిగి తాళాలు తీసుకుని బీరువాలో నుండి బట్టలుతీసి వేసుకుని ఆఫీసుకువెళ్లిపోయాడు. సాయంత్రం ఆఫీసు కాగానే యింటికి వచ్చాడు కాఫీ, టిఫిన్ రడీగా వుంచింది సుశీల కాఫీ తాగుతూ హాయిగా నవ్వుతూ ఎన్నో కబుర్లు

[32 వ పేజీ చూడండి]

## సంక్షిప్త చిత్ర వార్తలు

★ కె. హేమాంబరధరరావు దర్శకత్వంలో శశి నిర్మించే శశి మూవీస్ ''కొత్త కోడలు'' చిత్రంలో చంద్రమోహన్, రోజారమణి, నాగభూషణం, శరత్‌బాబు, ఈశ్వరరావు, సురేష్, సంకాయల సత్యనారాయణ, సారథి, రవి, పరశురామయ్య, రమాప్రభ, రాజశ్రీ, విజయలక్ష్మి, జయమాలిని, ఫణి పాత్రధారులు. ఆదుర్తి నరసింహమూర్తి రచయిత. సత్యం సంగీత దర్శకుడు. లోగసింగ్ సగాయిచ్ ఛాయాగ్రాహకుడు. కూర్పు : చౌదం. శిల్పం : బి. ఎన్. కృష్ణ. సహకార దర్శకుడు : టి. వి. ఎస్. రాజు.

★ వి. మధుసూదనరావు దర్శకత్వం వహించిన 48వ చిత్రం శాంతిశ్రీ పిక్చర్స్‌వారి ''అంగడి బొమ్మ'' వర్ణ చిత్రం విజయవాడలో జూలై 16న ప్రారంభింపబడి, ఆగస్టు 12న అనుకున్న గడువుకు మూడు రోజుల ముందే పూర్తయింది శ్రీధర్, నారాయణరావు, నాగభూషణం, నరసింహరాజు, సీమ, అంజలీదేవి, నిర్మల, ఉమ రాళ్ళపల్లి, బేబీ సుమతి, మాస్టర్ రాజు మున్నగువారితో విజయవాడకు చెందిన ఔత్సాహిక కళాకారులు రాజ్యలక్ష్మి, మహీజా, ఆనంద్, కోకా సంజీవరావు ప్రభృతులు పాల్గొన్నారు. ఆత్రేయ రచయిత. ఎస్. వెంకటరత్నం ఛాయాగ్రాహకుడు. సత్యం సంగీత దర్శకుడు కూర్పు : సంజీవి. శిల్పం : బి. ప్రకాశరావు. నిర్మాతలు : కె. ఎస్. ప్రకాశరావు, డి. ప్రసాదరావు.

★ భరణీ చిత్ర ఎంటర్‌ప్రైసెస్ వారి తొలి వర్ణ చిత్రానికి ఇటీవల శివసముద్రం జలపాతం వద్ద సుభాషిణి, నూతన నటుడు ప్రసాద్ పాల్గొన్న కొన్ని సన్నివేశాలు చిత్రీకరింపబడ్డాయి. మురళీమోహన్, లత, నరసింహరాజు, రావి కొండలరావు, పుష్పకుమారి ముఖ్య పాత్రధారులు. వసంతకుమార్ సంభాషణలకర్త. ఇళయరాజా సంగీత దర్శకుడు. తివారీ ఛాయాగ్రాహకుడు. శిల్పం : సూర్యకుమార్. టి. భరణీకుమార్ నిర్మించే ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం : శ్రీధర్.

★ జయసుధ, కమలహాసన్ నాయికా నాయకులుగా కె. బాలచందర్ కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో టి. విశ్వేశ్వరరావు నిర్మించే భారత్ ఫిలిమ్స్‌వారి ''ఇది కథ కాదు'' చిత్రానికి ఆగస్టు 28న ''ప్రియుడే సంగీతము – ప్రియురాలే నాట్యము'' అనే ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యం, పి. సుశీల గానం చేసిన యుగళగీతం ధ్వనిముద్రిక చేయబడడంతో ప్రారంభోత్సవం జరిగింది. అక్టోబర్ నించి డిసెంబర్ వరకు మద్రాసులో జరిగే షూటింగ్‌తో పూర్తయ్యే ఈ చిత్రానికి గణేశ్ పాత్రో సంభాషణలకర్త. ఎం. ఎస్. విశ్వనాథం సంగీత దర్శకుడు. లోకనాథ్ ఛాయాగ్రాహకుడు.



'రామ బాణం'లో జమున, శోభన్

## జారుడు మెట్లు

[25 వ పేజీ తరువాయి]

చెప్పుకున్నారు. వారిద్దరూ సఖ్యతగా మాట్లాడుకుంటుంటే పిల్లలిద్దరూ విస్మయంతో వారివంక చూశారు.

ఆరోజే సుశీల బాబాయి కొడుకు రామారావు వద్ద నుండి ఉత్తరం వచ్చింది. ఒక పది సెంట్ల స్థలం బేరానికి వచ్చినట్లు బావగారొచ్చి చూసి సర్దేనంటే మిగిలిన పనులు నేను చూసుకుంటానని రాశాడు.

శంకరం రెండురోజులు సెలవు పెట్టి గుడివాడ వెళ్ళివస్తానన్నాడు. సుశీలకు చాలా ఆనందంగా వుంది. వ్యసనాలకు అలవాటుపడిన భర్తలో ఇంత త్వరగా మార్పు వస్తుందనుకోలేదు. భగవంతుని దయవలన భర్త వ్యసనాలకు స్వస్తి చెప్పటం, అదృష్టంకొద్దీ స్థలం బేరానికి రావటం అంతా విచిత్రంగానే వుంది. ఏదో అన్నయ్య దయవలన స్థలం కుదిరితే ఒక ఇల్లనేది ఏర్పర్చుకోవచ్చు అనుకుంది. తాము కట్టబోయే ఇల్లు ఎలా వుండాలి? ఏమేమి చెయ్యాలని వూహించుకుంటూ ప్రశాంతంగా నిద్రపోయింది.

తూరుపు తెలతెలవారుతూవుండగా సుశీల పెద్దకొడుకు తట్టిలేపుతూ ''అమ్మా, అమ్మా రాత్రి తలుపులు వెయ్యకుండా పడుకున్నావే'' అని అడుగుతుంటే సుశీల అదిరిపడి పక్కపుదుటున లేచి కూర్చుంది.

పక్క మంచంమీద శంకరం లేడు ఇల్లంతా ఓసారి చూసొచ్చి ఏదో అనుమానం రాగా గబగబ బీరువా తెరిచి చూసుకుంది. శంకరం బట్టలు, గాజులు, గొలుసు కనిపించలేదు. ఆతృతగా బ్యాంక్ పాస్ బుక్ తెరిచి చూసింది. వడ్డీతోసహా మొత్తం డబ్బు డ్రా చేయబడి వుంది.

''ఓడిపోయాను శంకరం. నేనోడిపోయాను. నేనేకాదు నా వెనక పవిత్రమైన ప్రేమ, అనురాగం, ఆప్యాయత, నీతీ, నిజాయితీ, న్యాయం, ధర్మం అన్నీకూడ ఓడిపోయాయి.'' అనుకుంటూ కుప్పలా నేలమీద కూలబడిపోయింది.

* * *

శంకరం బొంబాయి వెళ్ళే ట్రెయిన్‌లో కూర్చున్నాడు. ఆతని మనసిప్పుడు చాలా ఆనందంగా వుంది. జేబు తడిమి చూసుకున్నాడు. వత్తుగా నోట్లకట్టలు తగిలాయి. బొంబాయిలో ఉద్యోగాలు ఈజీగా దొరుకుతాయట. హోటల్ సర్వర్‌కే అయిదారు వందలు జీతం ఇస్తారంట. రోజుకు వంద రూపాయలు టిప్పు కూడ దొరుకుతుందట. పెద్ద పెద్ద వాళ్ళంతా ఫారిన్ సరుకు తాగినంత తాగి మిగిలింది సర్వర్లకే వదిలేసి పోతారంట తనెలాగైనా సర్వర్ ఉద్యోగం సంపాదించాలి.

తన వునికి అనేది ఎవ్వరికీ తెలియనంత దూరం వచ్చేశాడు. ''పెళ్ళాం, పిల్లలు. ఛీ, ఛీ వెధవ సంత. సుశీల కెంత అహంకారం? ఏదో గుడ్డలు కుట్టి నాలుగు డబ్బులు సంపాదిస్తున్నానని ఎంత పొగరు? అర్ధరాత్రి వచ్చి తలుపు కొడితే తియ్యదా? పైగా ఆఫీసుకు వచ్చి అందరిలోనూ నన్నల్లరి చేస్తుందా? ఎదురు తిరిగి కొడతానంటూ బెదిరిస్తుందా? ఇప్పుడు తెలుస్తుంది తన సంగతి'' కసిగా అనుకున్నాడు శంకరం.

బొంబాయి నగరం చూసేసరికి శంకరానికి కళ్ళు తిరిగినంత పనైంది అక్కడి భాష అతనికే మాత్రం అర్థం కావటంలేదు ఎలాగో టాక్సీ మాట్లాడుకుని ఓ హోటల్లో బస చేశాడు డేన్నియల్ అని ఓ పేకాట గ్యాంగ్ లీడరుతో పరిచయం చేసుకున్నాడు అతనికి ''సర్వర్ ఉద్యోగం కావాలని'' చెప్పాడు. ''ఓ నెల రోజుల్లో ఆ హోటల్లోనే సర్వర్ ఉద్యోగం ఇప్పిస్తానన్నాడు''

## జారుడు మెట్లు

డేన్నియల్ హోటల్లో తింటూ, డేన్నియల్ గేంగ్‌తో పేకాడుతూ వారం రోజులు గడిపాడు.

ఈ వారం రోజుల్లోనూ డేన్నియల్ శంకరం ఆనూ, మూనా మొత్తం తెలుసుకున్నాడు ఆరోజు శంకరానికి ఫారిన్ సరుకు చిత్తుగా తాగించి అతను తెలివి తప్పి పడిపోగానే అతని డబ్బంతా సర్వం దోచుకున్నారు

సర్వం దోచుకోబడిన శంకరం పిచ్చివాడి లాంటి బికారిలా బొంబాయి వీధులన్నీ తిరిగాడు జీవనోపాధికి ఎలాంటి అవకాశం దొరకలేదు తినటానికి తిండి దొరకక తల దాచుకోను ఇంత చోటు దొరకక అష్టకష్టాలూ పడుతూ మూడు నెలలు గడిపాడు అతని ఆకారం పిచ్చివాడిలాగా ఓ బిచ్చగాడిలాగా తయారైంది

అప్పుడు భార్య పిల్లలు గుర్తువచ్చారు. ఇంటిదారి పట్టాడు. స్టేషన్‌లో బండి దిగగానే తను మసిలిన వూరు, తనవాళ్ళు వున్న వూరు అనుకోగానే ఒంట్లోకి కొత్త సత్తువ వచ్చింది. కాళ్ళు అలవాటుచొప్పున వడివడిగా నడుస్తున్నాయి

సుశీలను పిల్లల్ని చూసి కొన్ని యుగాలు గడిచినట్లుగా వుంది. తను చేసిన పనికి సుశీల తనను క్షమిస్తుందో లేదో? ఇంకెప్పుడూ యిలాంటి వ్యసనాల జోలికి పోకూడదు బుద్ధొచ్చింది. మనసులోనే చెంపలు వేసుకున్నాడు. ''భగవంతునిసాక్షిగా ఇంకెప్పుడూ యిలాంటి పని చెయ్యనని సుశీలకు ప్రమాణంచేసి చెప్పాలి'' అనుకున్నాడు.

ఇల్లు వచ్చేసింది. గుమ్మంలో నిలబడి ఆతృతగా తలుపుమీద దబదబ కొడుతున్నాడు. సుశీల తలుపు తీస్తుంది. తనను చూసి ఆశ్చర్యపోతూ గట్టిగా కౌగిలించుకుంటుంది ''ఏమండీ నన్నూ, పిల్లల్నీ నిర్దాక్షిణ్యంగా ఒదిలేసి ఎక్కడికెళ్ళారు.'' అని బావురుమంటుంది. తను సుశీలను గట్టిగా హృదయానికి హత్తుకుని ఇంకెప్పుడూ మిమ్మల్నొదిలిపోనని ఓదారుస్తాడు. గట్టిగా, మరింత గట్టిగా తలుపులు దబదబ బాదుతున్నాడు, ''సుశీలా, సుశీలా'' అంటూ.

''ఎవరది? తలుపులు విరిగిపోయేలా బాదుతున్నావు? తాళం వేసివుంది కనపడటం లేదూ?'' ఇంటాయన గొంతు ఖంగుమంటూ వినిపించింది.

''నేనండీ శంకరాన్ని. నా భార్య సుశీలను పిలుస్తున్నాను'' అన్నాడు శంకరం.

''ఇంకెక్కడి సుశీలయ్యా? నువ్వెళ్ళిన మర్నాడే ఆవిడ ఉరేసుకుని చచ్చిపోయింది. సామానూ, పిల్లల్నీ మీ తండ్రిగారు తీసుకెళ్ళారు. ఏమయ్యా శంకరం నీకేమన్నా బుద్ధుందయ్యా? తాగుడు పేకాటంటూ వ్యసనాల కలవాటుపడి పచ్చని సంసారాన్ని భార్యా పిల్లల్ని ఒదిలేసి దేశాలమ్మట పోతావుటయ్యా? పాపమా ఇల్లాలు అభిమానవంతురాలు కనుక ఆత్మహత్య చేసుకుంది. అన్నట్టు నీ స్నేహితుడు మురళి లేడూ? తప్పతాగి లారీ క్రింద పడి రెండు కాళ్ళూ విరగ్గొట్టుకున్నాడు. ప్రాప్తుడు ఎందరి కాపురాలకు చిచ్చుపెట్టాడో కర్మఫలం అనుభవిస్తున్నాడు'' అన్నాడు ఇంటాయన.

''వ్యసనాలనేవి జారుడుమెట్లు లాంటివి వాటిమీద నుండి జారిపడిన మనిషి అఘాతంలాంటి ఊబిలో చిక్కుకుంటాడు.'' సుశీల మాటలు చెవిలో గింగురుమంటుంటే కుప్పలా అరుగుమీద కూలబడిపోయాడుశంకరం.




KSL-95-Tel